

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.147	213	243
సూర్యాపేట	రూ.145	210	240
నల్లగొండ	రూ.149	216	246

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.5 కనిష్ఠం 24.8

వేమూరి కనకదుర్గకు ఘన నివాళులు



నల్లగొండ, ఏప్రిల్ 27: 'ఏబీఎన్, ఆంధ్రజ్యోతి' సంస్థల డైరెక్టర్ వేమూరి కనకదుర్గ తృతీయ వర్ధంతి సందర్భంగా నల్లగొండ 'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయంలో ఆమెకు శనివారం ఘన నివాళులు అర్పించారు. వేమూరి కనకదుర్గ చిత్రపటానికి 'ఆంధ్రజ్యోతి' నల్లగొండ బ్రాంచ్ మేనేజర్ దాసరి చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఏబీఎన్, ఆంధ్రజ్యోతి' అభివృద్ధికి వేమూరి కనకదుర్గ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. సంస్థలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమం కోసం పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' బ్యూరో ఇన్‌చార్జి చల్లా సాంబశివారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఆందోజు కృష్ణమాచారి, నల్లగొండ పీసీ ఇన్‌చార్జి పులిమామిడి మహేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

రంజుగా రాజకీయం

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో రోజుకో తీరు పరిణామాలు
- బీఆర్‌ఎస్‌లో గుత్తా వర్గీయుల భిన్నస్వరం
- కాంగ్రెస్‌లో ఆసక్తికర పరిణామాలు
- మిర్యాలగూడలో చేరికలను అడ్డుకున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ వర్గీయులు
- క్యాడర్ నిరసనతో చేరికలపై వెనక్కితగ్గిన అధిష్ఠానం

లోక్‌సభ ఎన్నికల సమరం వేడెక్కుతున్న తరుణంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రాజకీయ పరిణామాలు రోజుకో తీరుగా మారుతున్నాయి. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ వర్గపోరుతో సతమతమవుతుంటే, కాంగ్రెస్‌లోనూ భిన్నపరిస్థితి నెలకొంది. రెండు ప్రధాన పార్టీల్లో లోక్‌సభ ఎన్నికల ముంగిట ఏర్పడ్డ వాతావరణం నాయకుల్లో ఆందోళనకు దారితీస్తోంది. ఇదే పరిస్థితి ఎన్నికల వరకు కొనసాగితే ఆ ప్రభావం పోలింగ్ సరళిపై కనిపిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధిష్ఠానాలకు తలనొప్పిగా మారుతున్న ఇక్కడి వ్యవహారాలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)



బీఆర్‌ఎస్‌లో కీలక నేతల నడుమ అసెంబ్లీ ఎన్నికల నుంచి నెలకొన్న విభేదాలు తాజాగా ఒక్కోటి బహిర్గతమవుతున్నాయి. ప్రధానంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వర్గీయులకు, మాజీ ప్రజాప్రతినిధుల వర్గీయుల నడుమ ఉన్న వర్గభేదాలు ఆ పార్టీలో చిచ్చురేపుతున్నాయి. సుఖేందర్‌రెడ్డి స్వయంగా పలుమార్లు ఏదో ఒక వేదికగా బీఆర్‌ఎస్‌లో అసమ్మతిపై, పార్టీ విధానాల్లోని లోపాలపై సూటిగా విమర్శలు సంధించారు. ఆయన తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి తొలుత జిల్లాలోని రెండు లోక్‌సభ సీట్లలో ఒక దానికి పోటీకి సిద్ధమని ప్రకటించి, ఆతర్వాత పోటీ నుంచి తప్పుకున్నారు. పార్టీ అభ్యర్థుల ఎంపిక జరిగాక ప్రచారానికి సైతం దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించిన బస్సుయాత్రకు కూడా అమిత్ దూరంగా ఉన్నారు. దీంతో ఆయన కాంగ్రెస్‌లోకి వెళతారనే ప్రచారం సాగుతోంది. తాజాగా, గుత్తాపై మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ అనుచిత ఆరోపణలు చేశారని ఆయనపై గుత్తా వర్గీయులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు నేతృత్వంలో సుఖేందర్‌రెడ్డి వర్గీయులు సుఖేందర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టి మరీ కిషోర్‌కుమార్‌పై విమర్శలు గుప్పించారు. ఇది బీఆర్‌ఎస్‌లోనేగాక ఇతర పార్టీల్లోనూ చర్చకు దారితీసింది. పార్టీ క్యాడర్ ఏకతాటిపై నిలబడి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఢీకొట్టాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సూచిస్తుంటే, తాజా పరిణామాలు ఇబ్బందికరంగా మారాయని క్యాడర్‌లో చర్చసాగుతోంది.

కాంగ్రెస్‌లోనూ ఆసక్తికర పరిణామాలు

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లోనూ భిన్న పరిణామాలు నెలకొంటున్నాయి. పార్టీలోకి ఎవరు వచ్చినా చేర్చుకోవాలనే లక్ష్యంతో ఉన్నత స్థాయి నేతలు పిలుపునిస్తుంటే, నియోజకవర్గాల్లో కొంత విరుద్ధమైన పరిస్థితి నెలకొంది. జిల్లాలో బీఆర్‌ఎస్‌లోని పలువురు ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతుంటే మెజార్టీ నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీ పాత క్యాడర్‌కు నచ్చజెబుతూ చేరికలను స్వాగతిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఆ తర్వాత కూడా ఈ చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. మునిసిపాలిటీల్లో చైర్మన్ పీఠాలను కైవసం చేసుకునేందుకు ఈ చేరికలు కాంగ్రెస్‌కు పలుచోట్ల ఉపయోగపడ్డాయి. వేర్వేరు సందర్భాల్లో బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు సీనియర్, జూనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి, గ్రామస్థాయి నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే మునుగోడు నియోజకవర్గానికి చెందిన చల్లమల కృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరితే, ఆయన చేరికను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వర్గీయులు తీవ్రంగా వ్యతిరేకించడంతో దాన్ని పార్టీ నిలిపివేసింది. తాజాగా, మిర్యాలగూడ నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి రిపీట్ అయింది. ఇక్కడ సైతం అసెంబ్లీ ఎన్నికలకు ముందు పలువురు కీలకనేతలు, ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్‌లోకి జంప్ చేశారు. ఎన్నికలవరకు చేరికలను స్వాగతించిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు చేరుతున్న వారిని తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో, కష్టకాలంలో అండగా ఉన్న తమను కనీసం సంప్రదించకుండా, తమకు సంబంధం లేకుండా చేర్చుకుంటే ససేమిరా అనడంతో పార్టీ అధిష్ఠానం సైతం ఒక్కడుగు వెనక్కివేసింది. తాజాగా, మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, మరో 13 మంది కౌన్సిలర్లు పీసీసీ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి సమక్షంలో పార్టీలో చేరినా, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వర్గీయులు అధిష్ఠానానికి తమ అసమ్మతిని తెలియజేయడంతో ఆ చేరికను నిలిపివేస్తూ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ ప్రకటన జారీ చేశారు. ఎమ్మెల్యే బి.లక్ష్మారెడ్డితో కలిసి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ మిర్యాలగూడలో మీడియా సమావేశం ఏర్పాటుచేసి మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్ల చేరికను అధిష్ఠానం నిలిపివేసిందని, ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు, పార్టీ క్యాడర్ అభిప్రాయాలు తీసుకున్నాకే చేరికలపై ఇకముందు పార్టీ నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. వాడివేడిగా ఈ పరిణామాలు జరుగుతుండడంపై కాంగ్రెస్‌తో పాటు, ఇతర రాజకీయవర్గాల్లోనూ ఈ పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్



- సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు అండగా ఉండటమే లక్ష్యం
- పోలీస్‌శాఖలో అందుబాటులోకి కొత్త వ్యవస్థ
- ఒకే రకమైన సేవలకోసం 5ఎస్ విధానం అమలు

చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు కూర్చున్న చోటు నుంచే నిమిషాల వ్యవధిలో ప్రపంచాన్ని చుట్టేసే అవకాశం ఉంది. అదే సమయంలో నచ్చిన వస్తువును ఇష్టమైన స్టోర్స్ లేదా ప్రదేశం నుంచి కొనుగోలు చేసుకునే సదుపాయం కూడా ఉంది. అంతేగాక డిజిటల్ రూపంలోనే పలు రంగాల్లో పెట్టుబడులు కూడా మొబైల్ ఫోన్ నుంచే పెడుతున్నారు. ఇదే అదనుగా వివిధ యాప్స్, వెబ్‌సైట్లలో ప్రత్యక్షమవుతున్న ఆఫర్లకు పలువురు అత్యాశ తో పెట్టుబడులు పెట్టి మోసపోతున్నారు. దీంతో సివిల్, క్రిమినల్ నేరాల సంఖ్య తో పోటీపడేలా సైబర్ నేరాలు క్రమేపీ పెరుగుతున్నా యి. వీటిని అరికట్టేందుకు రాష్ట్ర పోలీస్‌శాఖ ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు సైబర్ వారియర్‌ను ఏర్పాటుచేసిం ది. అదేవిధంగా పోలీస్‌స్టేషన్లలో నాణ్యమైన సేవల కోసం 5ఎస్ విధానాన్ని అమలు చేస్తోంది.

- భువనగిరి టౌన్, సూర్యాపేటక్రైం



డిజిటల్ లావాదేవీలు, పెట్టుబడులపై కనీస అవగహన కొరవడిన వారే అధికంగా సైబర్ నేరాలబారిన పడుతున్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినా ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని అయోమయ పరిస్థితి వారిది. అయితే సైబర్ నేరాలపై వస్తున్న ఫిర్యాదులపై పోలీసులు స్పందించి కేసు నమోదు చేస్తున్నారు. అంతేగాక పలువురు నిందితులను అదుపులోకి తీసుకొని కాజేసిన మొత్తాన్ని రికవరీ చేస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారు. అయినా సైబర్ నేరాల బాధితులకు పూర్తిస్థాయిలో జరుగుతున్న న్యాయం అంతంత మాత్రమే. బాధితులు ఫిర్యాదులు చేయని పక్షంలో తామేం చేయగలమని పోలీసులు అంటున్నారు. సైబర్ నేరాలపై ఫిర్యాదుకు ఇప్పటివరకు నాలుగు అంకెల టోల్‌ఫ్రీ నెంబర్ మాత్రమే అందుబాటులో ఉండగా, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలంటే హైదరాబాద్ నగరంలోని సైబర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలి. ఈ నేపథ్యంలో పెరుగుతున్న సైబర్ నేరాల నియంత్రణకు, మోసపోతున్న బాధితులకు అండగా ఉండేలా రాష్ట్ర పోలీస్‌శాఖ సైబర్ వారియర్స్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. నూతన వ్యవస్థ ద్వారా ఇక నుంచి ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఒక సైబర్ వారియర్ ఉంటారు. సంబంధిత పోలీస్ స్టేషన్లో పరిధిలో సైబర్ వారియర్స్ సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తుండటంలో పాటు ఫిర్యాదులను స్వీకరించి బాధితులకు న్యాయం జరగేలా ప్రయత్నిస్తారు. ఈ మేరకు రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లోని యాదాద్రి జోన్ పరిధిలో 18 పోలీస్‌స్టేషన్లో పనిచేస్తున్న 18 మంది కానిస్టేబుళ్లను సైబర్ వారియర్స్‌గా నియమించారు. ప్రతీ సైబర్ వారియర్‌కు ప్రత్యేకంగా ఒక సెల్‌ఫోన్‌ను కేటాయించారు. ఇకనుంచి సైబర్ నేరాల బాధితులు నేరుగా స్థానికంగా ఉండే వారియర్స్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

స్థానికంగా ఫిర్యాదుల స్వీకరణ

సైబర్ నేరాల బాధితులు ఇక నుంచి వారి ప్రాంతంలోని పోలీస్ స్టేషన్‌లోని సైబర్ వారియర్‌కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. వారు వెంటనే వివరాలను నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో నమోదు చేస్తారు. కేసు వివరాలను ఎప్పటికప్పుడు బాధితులకు తెలియజేస్తారు. అలాగే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కూడా ఫోన్ చేసి సైబర్ నేరాలపై బాధితులు ఫిర్యాదు చేయవచ్చు. 1930కు ఫోన్ చేసిన వెంటనే ఈ వివరాలు స్థానిక సైబర్ వారియర్‌కు చేరుతాయి.

పోలీస్‌స్టేషన్లలో 5ఎస్ విధానం

రాష్ట్ర ప్రజలందరికీ ఒకేరకమైన సేవలందించేందుకు పోలీస్‌శాఖ 5 ఎస్ విధానాన్ని అమలుచేస్తోంది. న్యాయం కోసం స్టేషన్‌కు రిక్షాలో వచ్చినా,కారులో వచ్చినా ఒకే రకమైన సేవలందించి ప్రజల్లో పోలీస్‌శాఖపై భరోసా కల్పించేందుకు యత్నిస్తోంది. సాంకేతిక పరిజ్ఞాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటున్న పోలీస్‌శాఖ స్టేషన్ల పరిస్థితిపై దృష్టి సారించింది. 5ఎస్ విధానంలో స్టేషన్లలోని ఫైళ్లన్నింటినీ ఓ క్రమ పద్ధతిలో ఏర్పాటు చేస్తారు. అవసరమైన ఫైల్ ఎప్పుడు కావాలంటే అప్పుడు దొరికే వెసులుబాటు ఉంటుంది. స్టేషన్లలో రిసెప్షన్ కౌంటర్లు, వాహనాల పార్కింగ్, పార్కింగ్ బోర్డు, పరిశుభ్రత, సీజ్ చేసిన వాహనాలన్నింటినీ ఒకే చోట ఏర్పాటు చేయడంలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ప్రస్తుతం అన్ని పోలీస్‌స్టేషన్లలో ఈవిధానాన్ని అమలు చేస్తున్నారు.

వర్టికల్స్ విభాగాలు కూడా

పోలీస్‌శాఖలో ప్రతీ స్టేషన్‌లో 17 వర్టికల్స్ విభాగాలకు సంబంధించి అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అందులో రిసెప్షన్ సిబ్బంది, స్టేషన్ రైటర్, క్రైమ్ కేసులకు సంబంధించి రైటర్, బ్లూకోట్స్, పెట్రోలింగ్ సిబ్బంది, కోర్టు విధులు నిర్వహించే సిబ్బంది, వారెంట్లను హాజరు పర్చే సిబ్బంది, కోర్టు సమన్లను జారీ చేసే సిబ్బంది, టెక్నికల్ టీం, సబ్‌ఇన్‌స్పెక్టర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, క్రైమ్ సిబ్బంది, ఆసుపత్రుల నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకొచ్చే సిబ్బంది, వాచ్‌డ్యూటీ సిబ్బంది, జనరల్ డ్యూటీ సిబ్బంది, స్టేషన్‌హౌస్ ఆఫీసర్, స్టేషన్ పరిపాలన అధికారితో కూడిన విభాగాలకు సంబంధించి విధులను నిర్వహిస్తున్నారు. ప్రతీ విభాగానికి సంబంధించిన సిబ్బంది, అధికారులకు పోలీస్‌శాఖ రోజు వారి విధులకు సంబంధించి ఇప్పటికే వివరాలతో కూడిన ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా ఎవరి విధులను వారు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు.

5ఎస్ విధానంలో పేట పోలీసులకు అవార్డులు

రాష్ట్రంలో పోలీస్‌శాఖలో 5ఎస్ విధానం అమలు విషయంలో సూర్యాపేట జిల్లా పోలీస్ నిరంతరం ప్రతిభ చూపుతున్నారు. అందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో రెండు సార్లు ప్రథమ స్థానంలో జిల్లా పోలీస్ నిలిచింది. అందుకు గత ఎస్పీ రాజేంద్రప్రసాద్ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారుల నుంచి అవార్డులు కూడా అందుకున్నారు.



ఒకే రకమైన సేవలందించేందుకు చర్యలు



న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఒక్కరికి తారతమ్యాలు లేకుండా ఒకే రకమైన సేవలందించేందుకు చర్యలు చేపట్టాం. డీజీపీ ఆదేశాల మేరకు స్టేషన్లలో 5ఎస్ విధానాన్ని అమలు చేస్తున్నాం. దీని ద్వారా స్టేషన్లన్నీ పరిశుభ్రంగా ఉంచుతున్నాం. అంతేకాకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన విధులను రోజు వారీగా సక్రమంగా నిర్వహిస్తున్నారు. పోలీస్‌శాఖలో క్రమ శిక్షణ కూడా మరింత పెరిగింది.

- రాహుల్‌హెగ్డే, సూర్యాపేట జిల్లా ఎస్పీ

బాధితులకు అండగా సైబర్ వారియర్స్



యాదాద్రి జోన్ సైబర్ వారియర్స్ సైబర్ నేరాల బాధితులకు అండగా ఉండనున్నారు. అవగాహనా రాహిత్యం, సులభ సంపాదన లక్ష్యంగా డిజిటల్ పెట్టుబడుల రూపంలో నష్టపోతున్న బాధితులకు సైబర్ వారియర్స్ ద్వారా న్యాయం జరగనుంది. స్థానికంగా ఫిర్యాదు చేసే అవకాశం లభించింది. అంతేగాక కేసు వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. అవగాహన లేనివారు డిజిటల్ కొనుగోలు, పెట్టుబడులకు దూరంగా ఉండటం క్షేమం.జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లో సైబర్ వారియర్స్ అందుబాటులో ఉన్నారు.

- ఎం.రాజేష్‌చంద్ర, యాదాద్రి డీసీపీ

అన్ని స్టేషన్లలో అమలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో 5ఎస్ విధానాన్ని అమలు చేస్తున్నారు. 5ఎస్ విధానం అంటే సార్టింగ్, సెట్ ఇన్ ఆర్డర్, షైనింగ్, స్టాండర్డయిజ్, సస్టేయిన్. సార్టింగ్ అంటే పోలీస్‌స్టేషన్లలో అవసరం ఉన్న, అవసరం లేని ఫైల్స్, వస్తువులను ఒకే దగ్గర ఏర్పాటు చేయడం. అత్యవసర సమయంలో ఫైల్స్ వెంటనే దొరికేందుకు క్రమ పద్ధతిలో అమర్చడం. అవసరం లేని ఫైల్స్‌ను గుర్తించి వాటిని మరోచోట ఉంచడం చేస్తారు. సెట్ ఇన్ ఆర్డర్ అంటే పోలీస్ స్టేషన్లలో ఉండే ఫైల్స్ వస్తువులు వెంటనే దొరికేలా క్రమ పద్ధతిలో ఏర్పాటు చేస్తారు. షైనింగ్ అంటే పోలీస్‌స్టేషన్ పరికరాలతో పాటు ఇతర పోలీస్ సామగ్రిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడంతో పాటు స్టేషన్ వాతావరణం ఆహ్లాదరకంగా ఉండేలా తీర్చిదిద్దుతారు. స్టాండర్డయిజ్ అంటే స్టేషన్‌లోని ముఖ్యమైన వస్తువులు, ఫైల్స్‌ను నిరంతరం ఒక నిర్దిష్ట ప్రదేశంలో భద్రపరుస్తారు. ఉమ్మడి జిల్లాలో 5ఎస్ విధానాన్ని పటిష్టంగా అమలుచేస్తున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వాహనాలు పార్కింగ్ చేసేందుకు ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా స్టేషన్లకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు వాహనాలు నిలిపేందుకు ఒక ప్రత్యేక ప్రదేశాన్ని కేటాయించారు. అదే విధంగా స్టేషన్లలో అధికారులు, సిబ్బందితో పాటు స్టేషన్‌కు వచ్చే ప్రజలు కూర్చునేందుకు కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేశారు. స్టేషన్‌కు వెళ్లగానే కనిపించేలా రిసెప్షన్ కౌంటర్ ఏర్పాటు చేశారు. అక్కడ ప్రజలకు వారి ఇబ్బందులను చెబితే రిసెప్షన్ కౌంటర్‌లో ఉండే సిబ్బంది వారికి అవగాహన కల్పించి ఫిర్యాదు రాయిస్తున్నారు. అంతేకాకుండా ప్రతీ దరఖాస్తును రిసెప్షన్ కౌంటర్ వద్ద నమోదు చేసుకొని రశీదు కూడా ఇస్తున్నారు.



నూరు శాతం కేసుల పరిష్కారం దిశగా న్యాయవ్యవస్థ

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే



జిల్లా కోర్టుల సముదాయాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే

నల్లగొండ టౌన్, నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 27: రాష్ట్రంలో నూరుశాతం కేసుల పరిష్కారం దిశగా న్యాయవ్యవస్థ ముందుకు సాగుతోందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన అధునాతన ఐదు కోర్టుల భవన సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నూతనంగా నిర్మించిన ఐదు కోర్టుల అధునాతన భవనంలో డిజిటలైజేషన్‌తో పాటు, అన్ని రకాల సౌకర్యాలను కల్పించామన్నారు. ప్రత్యేకించి లైబ్రరీ, రిక్రియేషన్ వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. కోర్టుల డిజిటలైజషన్‌లో నల్లగొండ రెండోదని పేర్కొన్నారు. కోర్టుల పూర్తిస్థాయి డిజిటలైజేషన్, మౌలిక సదుపాయాల కల్పనతో న్యాయవ్యవస్థ మరింత సమర్థంగా పనిచేసే అవకాశం కలుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు వచ్చే మార్పులకు అనుగుణంగా న్యాయవ్యవస్థ పనిచేయాలన్నారు. అదేవిధంగా న్యాయాధికారుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సుప్రీంకోర్టు సైతం సామర్థ్య పెంపుదలకు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. నల్లగొండ బార్ అసోసియేషన్, బెంచ్ సమన్వయంతో న్యాయం కోసం వచ్చే ప్రజలకు సహకరించి సత్వర న్యాయం అందించాలని కోరారు. అనంతరం హైకోర్టు జడ్జి వినోద్‌కుమార్, లక్ష్మణ్, విజయ్‌సేన్‌రెడ్డి, జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు మాట్లాడారు. అంతకుముందు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, హైకోర్టు జడ్జిలను కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందనా దీప్తి మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలోక్ అరాధే, న్యాయమూర్తులు టీ.వినోద్‌కుమార్, కె.లక్ష్మణ్, బి.విజయ్‌సేన్‌రెడ్డి తదితరులు శనివారం సాయంత్రం ఛాయా సోమేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. వారికి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి ఆధ్వర్యంలో అర్చక స్వాములు అజయ్‌కుమార్, ఉదయ్‌కుమార్ పూర్ణకుంభ స్వాగతం పలికారు. వారికి చెర్వుగట్టు ఆలయ ప్రధాన అర్చకుడు పి.రామలింగేశ్వరశర్మ వేదాశీర్వచనం చేశారు. వారివెంట దేవాదాయశాఖ ఏసీ మహేంద్రకుమార్, ఈవో సత్యనారాయణ, పురాతన దేవాలయాల ట్రస్ట్ బాధ్యులు సోమశేఖర్, రవి, భరత్, తదితరులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

డీసీహెచ్‌వో మాతృనాయక్



వార్డులో రోగితో మాట్లాడుతున్న డీసీహెచ్‌వో మాతృనాయక్

నాగార్జునసాగర్, ఏప్రిల్ 27: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీసీహెచ్‌వో డాక్టర్ మాతృనాయక్ హెచ్చరించారు. శనివారం సాగర్ హిల్‌కాలనీలోని కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వార్డులను సందర్శించి రోగులకు వైద్యం అందుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనతరం సీఎంవో డాక్టర్ భానుప్రసాద్ నాయక్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు సంబంధించిన అన్ని మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట వైద్యులు డాక్టర్ చక్రవర్తి, హెడ్‌నర్స్ అమ్మన్‌కుట్టి, తదితరులు ఉన్నారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావ్ సూర్యవంశి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 27: ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని లోకసభ ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావ్ సూర్యవంశి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటర్లలో చైతన్యం కోసం ఇలాంటి ఫొటో ఎగ్జిబిషన్లు మరింత విస్తృతంగా నిర్వహించాలన్నారు.ప్రతీ ఒక్కఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో, స్వీప్ నోడల్ అధికారి ఎస్.ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జిల్లా సమాచార, ప్రచార సంబంధాలశాఖ సహాయ సంచాలకుడు వెంకటేశ్వర్లు, సీబీసీ జిల్లా ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి కోటేశ్వరరావు, ఐకేపీ డీపీఎం అరుణ్‌కుమార్, మహిళా డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యామ్, లైబ్రేరియన్ రాజారాం పాల్గొన్నారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావ్ సూర్యవంశి

ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి

మాడ్గులపల్లి, మిర్యాలగూడ: పార్లమెంట్ ఎన్నికలను అధికారులు సమర్థంగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావ్ సూర్యవంశి అన్నారు. శనివారం మండలంలోని కుక్కడం గ్రామంలో, మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో జి.శ్రీనివాస్‌రావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం, ర్యాంప్ వంటి వసతులు కల్పించాలన్నారు. బీఎల్‌వోలు ఓటర్ స్లిప్‌ల పంపిణీ త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ రోజు ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట ఆర్ఐ అక్తర్‌అలీ, సూపర్‌వైజర్ రమణశ్రీ, బీఎల్‌వోలు మరియమ్మ, సుశీల, ఊర్మిళ, రజిత, తదితరులు ఉన్నారు. అదేవిధంగా మిర్యాలగూడ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, స్ట్రాంగ్‌రూమ్‌ను, వేములపల్లి మండలం, మిర్యాలగూడ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను, దామరచర్ల మండలం రాళ్లవాగుతండాలోని పోలింగ్ కేంద్రాలను, శెట్టిపాలెం వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు.

'సీ-విజిల్' యాప్‌ను వినియోగించుకోవాలి

ఎస్పీ చందనా దీప్తి



నల్లగొండ టౌన్, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఫిర్యాదులకు సీ-విజిల్ యాప్‌ను వినియోగించుకోవాలని ఎస్పీ చందనా దీప్తి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన వారిపై ప్రజలు సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. వచ్చిన ఫిర్యాదులపై వెనువెంటనే స్పందించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, నగదు, వస్తువులు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ, ప్రజల ఆస్తులను అనుమతి లేకుండా ప్రచారాలకు వినియోగించడం, కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం, ఓటర్ల రవాణా, అసత్య వార్తల ప్రసారం, చెల్లింపు వార్తల ప్రచురణ, మారణాయుధాలు కలిగి ఉండడం, ఇతర ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను సీ-విజిల్ ద్వారా చేయవచ్చన్నారు. ఫిర్యాదులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను అప్‌లోడ్ చేయడం ద్వారా నిర్ణీత కాలవ్యవధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటాయన్నారు.

రూ. లక్ష విలువైన కుక్కర్లు పట్టివేత

కోదాడ రూరల్, ఏప్రిల్ 27 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద శనివారం నిర్వహించిన తనిఖీల్లో రూ.లక్ష విలువైన కుక్కర్లను పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వ్యాన్‌ను తనిఖీచేయగా, సుమారు 400 కుక్కర్లు ఉన్నాయన్నారు. వీటి విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని, కుక్కర్లకు సంబంధించి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల అధికారికి అప్పగించినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

గుండాల, ఏప్రిల్ 27 : యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని తుర్కలశాపురం గ్రామానికి చెందిన ఉప్పుల వీరస్వామి, ఉప్పుల సత్తయ్య, లింగమ్మలకు చెందిన 300మోపుల గడ్డి వాము దగ్ధమైంది. దీంతో అప్రమత్తమైన రైతులు మంటలను ఆర్పడంతో చుట్టు ప్రక్కలకు వెళ్లకుండా చేయడంతో పెను ప్రమాదం తప్పింది. తమకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య


మంగమ్మ(ఫైల్)

చండూరు రూరల్, ఏప్రిల్ 27 : ఆర్థిక ఇబ్బందులు తాళలేక మహిళ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చండూరు మండలం దోనిపాముల గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చాపల మంగమ్మ(35) వ్యవసాయ కూలీ భర్త నర్సింహతో కలిసి గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భార్యాభర్తలు ఆర్థిక కారణాలతో ఇబ్బందులుపడుతూ మదనపడేవారు. ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెందిన మంగమ్మ శుక్రవారం ఉదయం భర్త నర్సింహ తన బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో అంబులెన్సులో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం శనివారం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మంగమ్మకు భర్తతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఇంట్లో గొడవతో వివాహిత...

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 27 : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన ఉయ్యాల పున్నమ్మ(50) భర్త శ్రీనుతో కలిసి సిమెంటు బ్రిక్స్ తయారు చేసేవారు. భర్తతో ఇటుకల తయారీపై చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన పున్నమ్మ డీజిల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. పున్నమ్మకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కట్టెల మిల్లులో అగ్నిప్రమాదం

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 27 : షార్ట్‌సర్క్యూట్‌తో నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో కట్టెల మిల్లులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పట్టణంలోని సాగర్ రోడ్డులోని పసునూరి జగదీశ్వరాచారికి చెందిన కట్టెల మిల్లులో ఈ ఘటన జరిగింది. సుమారు రూ.30లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. భారీ మంటలు చెలరేగడంతో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

దళితులు అభివృద్ధి కోసం మోదీని గెలిపించాలి

నల్లగొండ, ఏప్రిల్ 27: దళితులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ప్రధాని నరేంద్రమోదీని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని లక్ష్మి గార్డెన్స్‌లో పార్లమెంట్ స్థాయి బీజేపీ దళిత మోర్చా విజయసంకల్ప సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఇప్పటికే ఎన్నో సంక్షేమాలు అమల్లోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. దళితుల జీవితాలు మారాలంటే బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కన్వీనర్ చింత ముత్యాల్‌రావు, ప్రభారి పార్లమెంట్ చాడ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నూకల నర్సింహారెడ్డి, సుభాష్‌జీ, పోతెపాక లింగస్వామి, పోతెపాక సాంబయ్య, ఎడ్ల రమేష్, పెరిక మునికుమార్, జగ్జీవన్‌రామ్ తదితరులు ఉన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు


నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్,ఏప్రిల్ 27: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో స్వయంభువులకు నిత్యకైంకర్యాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి, నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. అనుబంధంగా కొనసాగుతున్న శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామడపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.35,10,162 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. ఇదిలా ఉండగా క్షేత్ర దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రసాదాలు అందించేందుకు నూతనంగా మరో కౌంటర్‌ను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తూర్పు రాజగోపురం ఎదురుగా కౌంటర్ ఉండగా, కొండపైన బస్టాండ్ ఆవరణలో ధర్మదర్శనం క్యూ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో, శివాలయం పక్కన ప్రసాదాల కౌంటర్లు అందుబాటులోకి రానున్నాయి.

వ్యక్తిపై కేసు నమోదు

ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించిన ఎస్.యాదగిరి (కొండపైన కొబ్బరి కాయలు విక్రయించే వ్యక్తి)పై కేసు నమోదు చేసినట్లు యాదగిరిగుట్ట టౌన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు ఫిర్యాదు మేరకు చీటింగ్, ఉద్యోగి విధులను అడ్డుకున్నందుకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. శనివారం 10మంది భక్తులు తూర్పు రాజగోపురం ఎదురుగా టెంకాయలు కొనేందుకు కొబ్బరికాయల దుకాణం వద్దకు వెళ్లగా వారికి దర్శనం చేయిస్తానని చెప్పి వారి వద్ద నుంచి రూ.1,500 తీసుకున్నాడు. కానీ, ఐదు టికెట్లతో 10మందిని లోనికి పంపించేందుకు ప్రయత్నించగా, అనుమతించేందుకు అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆలయ ఉద్యోగి మనోహర్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశాడు. మరో ఐదు టికెట్లు లేదా ప్రోటోకాల్ ఆఫీస్ నుంచి అనుమతి చీటీ తేవాలని చెప్పాడు. అయితే ఆలయంలోకి ఎందుకు పంపవని ఉద్యోగితో వాగ్వాదానికి దిగాడు. ఈ సంఘటనపై ఆలయ అధికారులు విచారించగా, తమ నుంచి సదరు వ్యక్తి డబ్బు వసూలు చేసినట్లు భక్తులు చెప్పారు. ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించినందుకు ఈవో ఏ.భాస్కర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ధార్మిక కార్యక్రమాలు

గుట్టపై సంగీత,సాహిత్య, ధార్మిక సభలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సాయి స్వరణీ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో హిమతేజ కూచిపూడి నృత్యం, 7నుంచి 8 గంటల వరకు మహతి ఆర్ట్స్ ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించారు.

నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం


విలేకరులతో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

హుజూర్‌నగర్, ఏప్రిల్ 27: కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలల్లోనే పరిపాలన వైఫల్యం చెందిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలుచేయలేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఇప్పుడు హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. అసలు ఆట ఇప్పుడే మొదలైందన్నారు. నాలుగు నెలల్లోనే పోలీసులను అడ్డుపెట్టుకుని తమ పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టి పరిపాలన చేస్తున్నారని, మరో నాలుగున్నరేళ్లు పరిపాలన ఎలా చేస్తారని ప్రశ్నించారు. మంత్రులు ఉత్తమ్, వెంకటరెడ్డి పోలీసులను అడ్డం పెట్టుకుని పరిపాలన చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఉత్తమ్ ఆధ్వర్యంలోనే ఇసుక, మట్టి దందాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తమ్ కనుసన్నల్లోనే ఇసుక, మట్టిమాఫియా చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ కండువాలు వేసుకుంటేనే ఇసుక, మట్టి ట్రాక్టర్లను నడిపిస్తున్నారన్నారు. అలా కాకుండా బీఆర్ఎస్ కార్యకర్తల ట్రాక్టర్లు వెళితే పోలీసులతో కేసులు పెట్టిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌లో చేరితే ఒక న్యాయం, బీఆర్ఎస్‌లో ఉంటే ఒక న్యాయమా అని ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలను ప్రచారం కూడా చేయనివ్వడం లేదన్నారు. పోలీసులను కాపలా పెట్టి ఉత్తమ్ బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు బనాయిస్తున్నాడన్నారు. ప్రజలు తలుచుకుంటే కాంగ్రెస్ తలరాతను మారుస్తారని హెచ్చరించారు. ఎంపీ ఎన్నికల్లో లక్ష ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థిని ఓడిస్తామన్నారు. కేసీఆర్ పరిపాలనను ప్రజలు కోరుతున్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ కోఆర్డినేటర్ నర్సింహారెడ్డి, జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, బెల్లంకొండ అమర్‌గౌడ్, ముల్కలపల్లి రాంబాబు, పాలేటి రామారావు, బసవయ్య, శంభిరెడ్డి, సారెడ్డి భాస్కర్‌రెడ్డి, జగన్‌నాయక్, పిచ్చయ్య, వేములూరి రంగాచారి, నగేష్, రాము, పుష్ప, సంధ్య, రత్నం, రెహేనా, వెంకటరెడ్డి, జంగమయ్య, ఉపేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విధానాలతో రాష్ట్రంలో కరువు


విలేకరులతో మాట్లాడుతున్న కోదండరాం

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ విధానాలతోనే రాష్ట్రంలో కరువు వచ్చిందని, కరువు సమస్యకు బీఆర్ఎస్‌దే పూర్తి బాధ్యత అని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో తెలంగాణ జనసమితి కార్యాలయాన్ని శనివారం కోదండరాం ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఆ పార్టీ నాయకులు అనేక డ్రామాలాడుతున్నారని, పదేళ్ల పాలన సాగించిన బీఆర్ఎస్ నాయకులు కుట్రలు, కుతంత్రాలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టేందుకు నానా తంటాలు పడుతున్నారన్నారు. మూడు మాసాల కాంగ్రెస్ ప్రభుత్వం వెంట బీఆర్ఎస్ నాయకులు పడడం సిగ్గు చేటన్నారు. కృష్ణా నదిలో తెలంగాణ వాటాను సాధించలేకపోయారని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.1000 కోట్లు కేటాయిస్తే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్, రూ.200 కోట్లు కేటాయిస్తే బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్ట్‌లు పూర్తి జరిగేవన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పులమయంగా చేసి ప్రజలపై మోయలేని భారం వేసిన బీఆర్ఎస్‌కు ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజల చీత్కారానికి గురైన బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి హరీష్‌రావు దయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడుతున్నారని కోదండరాం మండిపడ్డారు. సమావేశంలో టీజేఎస్ నాయకులు దేశపాక శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, పుష్పలీల, బాలకృష్ణారెడ్డి, వరి, భైరి రమేష్, వినయ్, మారం లక్ష్మారెడ్డి, రతన్‌రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

24 కిలోల గంజాయి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

కేతేపల్లి, ఏప్రిల్ 27: ఒడిషా నుంచి ముంబైకి తరలిస్తున్న రూ.6లక్షల విలువైన 24కిలోల గంజాయి, ముగ్గురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సంఘటన 65వ నెంబర్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. నల్లగొండ డీఎస్పీ కే.శివరాంరెడ్డి కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ఐ శివతేజ తన సిబ్బందితో శనివారం తెల్లవారుజామున మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఉదయం 5.30గంటల ప్రాంతంలో విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపుకు వెళుతున్న ఓ లారీ నుంచి బ్యాగులు ధరించిన ఇద్దరు యువతులు, ఓ యువకుడు కిందికి దిగి కాలినడకన రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్లడాన్ని గమనించి వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న బ్యాగులు తనిఖీ చేయగా, వాటిలో గంజాయి ప్యాకెట్లు కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని వారి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వారు ముంబై పాలఘర్‌కు చెందిన ముస్కాస్ అఫ్తాబ్ అన్సారీ, షెహనాజ్ ఇలియానా, ఒడిషాలోని గజపతి జిల్లాకు చెందిన చిత్తునాయక్‌గా తేలింది. ఒడిషాకు చెందిన మనోజ్‌మాలిక్ వద్ద నుంచి ముంబై పాలఘర్‌కు చెందిన మైకెల్‌కు వీరు గంజాయి సరఫరా చేస్తున్నారు. ఇలా సరఫరా చేసినందుకు ఒక్కొక్కరికి రూ.6వేల చొప్పున చెల్లించేందుకు మైకెల్ ఒప్పందం చేసుకున్నాడని తెలిపారు. ఈ క్రమంలో ఒడిషాలోని భారంపూర్ నుంచి 65వ నెంబర్ జాతీయ రహదారి మీదుగా లారీలో ముంబైకి వెళ్తుండగా కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడిన 24 కిలోల గంజాయితో పాటు 4 సెల్‌ఫోన్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని డీఎస్పీ వివరించారు. గంజాయి విలువ సుమారు రూ.6లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. చిత్తునాయక్ గతంలో గంజాయి రవాణా చేస్తూ ముంబై తానానగర్ పోలీసులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించాడని, ఇటీవలే జైలు నుంచి విడుదలై తిరిగి గంజాయి రవాణాకు పూనుకున్నాడని వివరించారు. గంజాయి రవాణాదారులను పట్టుకున్న ఎస్ఐ శివతేజ, ఏఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది మహేష్, సురేష్, అజిత్‌లను ఆయన అభినందించారు. సమావేశంలో శాలిగౌరారం సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ శివతేజ పాల్గొన్నారు.

'పెరిక' కార్పొరేషన్ కాంగ్రెస్ చలవే

● దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య


ఇండ్లకోటయ్యగూడెంలో పెరికలతో మాట్లాడుతున్న వీరయ్య

నిడమనూరు, ఏప్రిల్ 27: కాంగ్రెస్ పార్టీ చలువ వల్లే పెరిక కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటైందని దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్, పెరిక కుల కార్పొరేషన్ సాధకుడు ముత్తినేని వీరయ్య అన్నారు. విజయ సంకల్పయాత్రలో భాగంగా శనివారం నల్లగొండ జిల్లా నిడమనూరులో మండలం ఇండ్లకోటయ్యగూడెం గ్రామంలో పెరికలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిక కులస్థుల దశాబ్దాల కల కార్పొరేషన్ ఏర్పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే నెరవేర్చడం అభినందనీయమన్నారు. పెరికలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో కార్పొరేషన్ సాధన సమితి అధ్యక్షుడు కోట మల్లిఖార్జున్‌రావు, మాజీ ఎంపీపీ అంకతి వెంకటరమణ, కుల సంఘం నియోజకవర్గం ఇన్‌చార్జి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంకతి సత్యం, అంకతి కృష్ణయ్య, పోకల కృష్ణయ్య, ఇండ్ల సత్యం, నాగేశ్వరరావు, అంకతి వెంకటేశ్వర్లు, బాల్తి సైదయ్య, ఇండ్ల వెంకటయ్య, జానకిరాములు, రాము పాల్గొన్నారు.

పెరిక కులస్థులు ఏకం కావాలి

మిర్యాలగూడ టౌన్: పార్టీలకతీతంగా పెరిక కులస్థులు ఏకం కావాలని సంఘ రాష్ట్ర నాయకులు ముత్తినేని వీరయ్య అన్నారు. దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా వీరయ్యను సంఘ కార్యవర్గ సభ్యులు నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం వీరయ్య మాట్లాడుతూ ప్రత్యేకావసరాలు కలిగిన వారికి సేవ చేసే అదృష్టం కలగడం భగవత్ నిర్ణయమన్నారు.కార్యక్రమంలో కోట మల్లిఖార్జున, ఇండ్ల గణేష్, బొలిశెట్టి వీరయ్య, నాగమల్లేష్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, భద్రయ్య, పరశురాములు పాల్గొన్నారు.

వేములూరి ప్రాజెక్టులో పడి వ్యక్తి మృతి

మఠంపల్లి, ఏప్రిల్ 27: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో ప్రమాదవశాత్తు కాలు జారి వేములూరి ప్రాజెక్టులో పడి వ్యక్తి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం భీల్యానాయక్‌తండాలో తండాకు చెందిన బానోతు సైదానాయక్(41) కొన్నిరోజులుగా మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు.శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన సైదానాయక్ శనివారం ఉదయం యాతవాకిళ్ల సమీపంలోని వేములూరి ప్రాజెక్టులో శవమై కనిపించారు. ప్రాజెక్టుకు వద్దకు వెళ్లిన మత్స్యకార్మికులు సైదాను గుర్తించి కుటుంబసభ్యులకు తెలిపారు. సైదా తన భార్యతో దూరంగా ఉంటున్నాడు. సైదానాయక్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న ఎడ్లపందేలు

మఠంపల్లి, ఏప్రిల్ 27 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త చర్చి తిరునాళ్ల సందర్భంగా శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల బండలాగు పందేలు కొనసాగుతున్నాయి. శనివారం ఆరు పండ్ల విభాగం హోరాహోరీగా సాగాయి. పోటీలను శుభవార్త దేవాలయ విచారణ గురువు మార్టిన్ పసల, మఠంపల్లి మాజీ సర్పంచ్ ఆదూరి కిషోర్‌రెడ్డి ప్రారంభించారు. పోటీలను తిలకించేందుకు రెండు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు, ప్రేక్షకులు తరలిరావడంతో వీవీ మైదానం కోలాహలంగా మారింది. ఆరు పండ్ల విభాగంలో 9 జతలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఫాదర్ వినోద్‌రెడ్డి, ఆదూరి మధుసూదన్‌రెడ్డి, శౌరెడ్డి, జలబాల్‌రెడ్డి, కె.చిన్నపురెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలశౌరెడ్డి, గాదె పవన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, సిస్టర్ రూబీ, సుజాత, అలంబాల్‌రెడ్డి, అంతోన్‌రెడ్డి, లూర్థురెడ్డి పాల్గొన్నారు.

నాలుగు పండ్ల విభాగంలో విజేతలు వీరే...

ఎడ్ల పందేల్లో నాలుగు పండ్ల విభాగంలో పల్నాడు జిల్లా గిత్తలు హవా కొనసాగింది. 11 జతలు పాల్గొనగా బాపట్ల జిల్లాకు తోట శ్రీనివాసరావు గిత్తలు 4,641 అడుగులు లాగీ మొదటి బహుమతి, ప్రకాశం జిల్లా యర్రగొండ్రపాలెంకు చెందిన పునాది శ్రీనివాస్‌రెడ్డి గిత్తలు 4,565 అడుగుల లాగి రెండవ బహుమతి, పల్నాడు జిల్లా గురుజాల మండలానికి చెందిన లింగా అంజయ్యచౌదరి గిత్తలు 4,396 అడుగులు లాగి మూడవ బహుమతితో పాటు మరో ఐదు స్థాయిల్లో దూరాన్ని లాగిన గిత్తెలు బహుమతులు గెలుచుకున్నాయి.


ఆరు పండ్ల విభాగంలో తలపడుతున్న గిత్తలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

భువనగిరి రూరల్, ఏప్రిల్ 27: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ సంతోష్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి పట్టణం బహార్‌పేటకు చెందిన ఎంకే మాణిక్యం(19) అతడి స్నేహితుడు భట్టు శివకుమార్ మండలంలోని ఎర్రంబెల్లి గ్రామం నుంచి మోటార్ సైకిల్‌పై భువనగిరికి వస్తున్నాడు. మార్గమధ్యలోని ఎర్రంబెల్లి శివారులోని మూలమలుపు వద్ద మోటార్‌సైకిల్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఎంకే మాణిక్యం అక్కడికక్కడే మృతి చెందాడు. శివకుమార్ తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. మాణిక్యం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.


బైక్ పైనుంచి పడి మహిళ

మఠంపల్లి, ఏప్రిల్ 27 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం ఎర్రగట్టు వద్ద బైక్ నుంచి పడి మహిళ మృతి చెందింది. ఈ ఘటనలో తుమ్మలతండాకు చెందిన గుగులోతు కళావతి అక్కడికక్కడే మృతి చెందింది. శనివారం ఉదయం హుజూర్‌నగర్‌లో పనినిమిత్తం బైక్‌పై బయలుదేరిన కళావతి ఎర్రగట్టు వద్ద వేగంగా వెళ్తుండగా అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో సడన్ బ్రేక్ వేయడంతో బైక్‌పై వెనుక ఉన్న ఆమె కిందపడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కళావతి మృతితో తండాలో విషాదఛాయలు అమలుకున్నాయి. కళావతికి భర్త బాబు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కారు అదుపు తప్పిన ఘటనలో యువకుడు..

సంస్థాన్‌నారాయణపురం, ఏప్రిల్ 27 : కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలో చోటుచేసుకుంది.ఎస్ఐ జగన్ తెలిపిన వివరాల ప్రకారం మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన బొయపల్లి రాము(19), జీడిమెట్ల శివ, జీడిమెట్ల సాయి, బోయపల్లి రాకేష్, మేకల వేణు, దోటి శ్రీకాంత్ స్నేహితులు. వీరి స్నేహితుడి సోదరి వివాహం శుక్రవారం మునుగోడులో జరిగింది. వివాహానికి కారులో వెళ్లి అక్కడి నుంచి సరదా కోసం దేవరకొండ దగ్గరలోని వైజాగ్‌కాలని వద్దకు వెళ్లారు. శుక్రవారం రాత్రి తిరిగి సొంత గ్రామం చీకటిమామిడికి వచ్చారు. రాత్రి ఏం తినకపోవడంతో చౌటుప్పల్‌కు వెళ్లి తిందామని కారులో చౌటుప్పల్‌కు బయలుదేరారు. చౌటుప్పల్‌కు వెళ్తున్న క్రమంలో చిమిర్యాల గుడిమల్కాపురం గ్రామల మధ్యలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జయ్యింది. డ్రైవింగ్ చేస్తున్న బొయపల్లి రాము అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటనపై సమాచారంతో పోలీసులకు అక్కడికి వెళ్లి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాము తండ్రి చిన్న వయస్సులోనే మృతి చెందగా, తల్లి ఆరు నెలల క్రితం మృతి చెందింది. రాము బాబాయి దగ్గర ఉంటున్నారు. అతడికి తమ్ముడు ఉన్నాడు. రాము కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తృటిలో తప్పిన పెనుప్రమాదం



కేతేపల్లి, ఏప్రిల్ 27 : విజయవాడ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న రెండు ఆర్టీసీ బస్సులు ఒకదానిని మరొకటి వెనుక నుంచి ఢీకొన్నాయి. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం చీకటిగూడెం గ్రామశివారులో 65వ నెంబర్ జాతీయరహదారిపై చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని రాజోలు డిపోకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు హైదరాబాద్ వైపునకు ఒకదాని వెనక ఒకటిగా వెళ్తున్నాయి. ఈ క్రమంలో హఠాత్తుగా రోడ్డు మీదకు గేదె అడ్డుగా వచ్చింది. దీంతో డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశాడు. ఈ సంఘటనతో వెనక బస్సు డ్రైవర్ తేరుకునేలోపే ముందున్న బస్సును వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి రెండు బస్సుల్లో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులు ఏం జరిగిందోనన్న భయంతో హాహాకారాలు చేశారు. ప్రయాణికుల తలలు సీట్లకు తగలడంతో రెండు బస్సుల్లోని ఏడుగురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. బస్సులు కూడా దెబ్బతిన్నాయి. సంఘటనా సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారికి అక్కడే ప్రథమ చికిత్సలు చేసిన అనంతరం ఇతర బస్సుల్లో వారిని గమ్యస్థానాలకు పంపించారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాద సంఘటన తమ దృష్టికి రాలేదని, ఈ విషయమై తమకు ఎవరూ ఫిర్యాదు కూడా చేయలేదని ఎస్ఐ శివతేజ తెలిపారు.

కాంగ్రెస్ నేతల మాయమాటలు నమ్మవద్దు

● బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి సైదిరెడ్డి



దేవరకొండలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

దేవరకొండ/కొండమల్లేపల్లి, గుర్రంపోడు, హాలియా, ఏప్రిల్ 27: కాంగ్రెస్ నేతల మాయమాటలు నమ్మవద్దని కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి కావడం ఖాయమని బీజేపీ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. చింతపల్లి, కురంపల్లి, కొండమల్లేపల్లి, గుర్రంపోడు, హాలియా మండలాల్లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచారసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీ కార్డులను అమలుచేస్తామని అధికారంలోకి వచ్చి హామీలను విస్మరించాడని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లాలునాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నా ఎస్ఎల్‌బీసీ, డిండి, నక్కలగండి ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని విమర్శించారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని, నల్లగొండ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కంకణాల నివేదితారెడ్డి, చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, మన్నెం రంజిత్‌యాదవ్, మామిడి వినోద్, బీజేపీ నాయకులు చనమోని రాములు, నక్క వెంకటేష్‌యాదవ్, ఏటికృష్ణ, కుంభం యాదగిరిగౌడ్, వరికుప్పల వెంకటయ్య, మల్లేష్, భరత్, చలమల వెంకట్‌రెడ్డి, బాలాజీనాయక్, రవినాయక్, చల్లా శ్రీలతారెడ్డి, ఒంగూరి రాకీ, కడియం సైదులు, వెంకట్‌రెడ్డి, రవీందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ బూత్ కేంద్రాల గుర్తింపు

మర్రిగూడ, ఏప్రిల్ 27: సమస్యాత్మకమైన 14 ఎన్నికల పోలింగ్ బూత్ కేంద్రాలను గుర్తించినట్లు తహసీల్దార్ బక్క శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఖుదాబక్షపల్లి, ఎరుగండ్లపల్లి, అజలాపురం, లెంకలపల్లి, కొండూరు, వట్టిపల్లి, కమ్మగూడ, సరంపేట, మర్రిగూడ గ్రామాల్లో ఉన్న వంటి ఎన్నికల పోలింగ్ బూత్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు ఆయన తెలిపారు. ముందస్తుగా ఈ పోలింగ్ బూత్ కేంద్రాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేందుకు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారుల ఆదేశాలకు అనుగుణంగా మే 7వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో ఓటర్ల చిట్టీలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీటీ తారకరామన్, ఆర్ఐ బషీర్, ఎస్ఏ శ్రీనివాస్‌నాయక్ తదితరులు ఉన్నారు.

శాలిగౌరారంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రచార సభ రేపు

శాలిగౌరారం, ఏప్రిల్ 27: భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభ ర్యాలీ ఈ నెల 29వ తేదీన సోమవారం సాయంత్రం 4 గంటలకు శాలిగౌరారంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం శాలిగౌరారంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు భువనగిరి పార్లమెంట్ పార్టీ ఇన్‌చార్జి, రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల పార్టీ ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్ల వెంట చెత్తవేస్తే కఠినచర్యలు



హిల్‌కాలనీలో రోడ్ల వెంట చెత్తను తొలగిస్తున్న కమిషనర్ శ్రీను

నాగార్జునసాగర్, ఏప్రిల్ 27: నందికొండ మునిసిపల్ పరిధిలో హిల్‌కాలనీ, పైలాన్‌కాలనీల పరిధిలో ఇళ్లల్లో చెత్తను రోడ్ల వెంట పడేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ శ్రీను హెచ్చరించారు. శనివారం పట్టణంలోని సాగర్ హిల్‌కాలనీ, పైలాన్‌కాలనీలల్లో చెత్త సేకరణ వాహనాలతో చెత్తను సేకరించే విధానాన్ని ఆయన పరిశీలించారు. హిల్‌కాలనీలో రోడ్ల వెంట పడేసిన చెత్తను మునిసిపల్ చెత్త వాహనంలో వేయించారు. ప్రతీ రోజు తమ ఇళ్ల ముందుకు వచ్చే చెత్త వాహనంలో మాత్రమే చెత్తను వేయాలని ఎక్కడ పడితే అక్కడ వేస్తే మునిసిపల్ చట్టం ప్రకారం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.

'కాంగ్రెస్ ఆలోచించి అభ్యర్థిని ఉపసంహరించుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

చిట్యాల, ఏప్రిల్ 27: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆలోచించి భువనగిరి పార్లమెంటు బరి నుంచి తప్పుకోవాలని భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి జహంగీర్, ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి కోరారు. శనివారం చిట్యాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మిగతా అన్ని స్థానాల్లో సీపీఎం కాంగ్రెస్‌కు మద్దతిస్తుందని, భువనగిరిలో సీపీఎంనకు మద్దతిచ్చి తమ అభ్యర్థిని ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదల హక్కులను కాలరాస్తుందని అన్నారు. లౌకిక, ప్రజాస్వామ్యవాదులంతా సీపీఎంను బలపరచాలని కోరారు.

చిట్యాలరూరల్: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి పనులను చేసే నాయకుడినే పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించాలని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్ కోరారు. మండలంలోని వెలిమినేడు, పిట్టంపల్లి, గ్రామాల్లో శనివారం ఎంపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వెలిమినేడుకు చెందిన బొంతల నర్సిరెడ్డి దంపతులు జహంగీర్‌కు ఎన్నికల ప్రచారం కోసం రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. గ్రామాల్లోకి వచ్చి ఓట్లు అడిగే నాయకులను ప్రజలు ప్రశ్నించాలని అన్నారు. ప్రజల కోసం నిరంతరం పోరాడే తనను ఎంపీగా గెలిపిస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులకు చేపట్టి సమస్యలు లేకుండా చూస్తానన్నారు. కార్యక్రమంలో తుమ్మల వీరారెడ్డి, బొంతల చంద్రారెడ్డి, అరుణజ్యోతి, కట్ట నర్సింహ, జిట్టా నగేష్, అవిశెట్టి శంకరయ్య, శ్రీను, అచ్చాలు, అరూరి శ్రీను, జిట్టా సరోజ, మేక అశోక్‌రెడ్డి, జిట్ట సరోజ, ఐతరాజు నర్సింహ, మెట్టు పరమేష్, మల్లం మహేష్, సుధాకర్‌రెడ్డి, గణేష్, కుమారస్వామి, నరేష్ పాల్గొన్నారు.

కోమటిరెడ్డి బ్రదర్స్ అవకాశవాదులు

● మరో ఉద్యమానికి బీఆర్ఎస్ శ్రీకారం

● మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 27: కోమటిరెడ్డి బ్రదర్స్ అవకాశవాదులని, పొద్దు తిరుగుడు పూలని, ఏనాడు కూడా నిజాలు పలకలేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం పార్టీ 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించడంతో పాటు నూతనంగా నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల అలుపెరుగని ఉద్యమాలతో ఢిల్లీ పెద్దల మెడలు వంచి తెలంగాణ సాధించిన బీఆర్ఎస్ పార్టీ మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను గోస పెడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను ఇబ్బంది పెడుతున్నందున ఆ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు పోరాడుతామన్నారు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌కు పిల్ల మూకలు లెక్కకాదని అన్నారు. కాంగ్రెస్ వచ్చాక ఆకలి చావులు, ఆత్మహత్యలు పెరిగాయన్నారు. రైతాంగ సమస్యలతో పాటు నేతన్నల సమస్యలు కూడా తీవ్ర రూపం దాల్చాయని, ప్రజలు ఉపాధి కోసం మళ్లీ విదేశాల బాట పట్టే పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించామని రేవంత్ సర్కార్ వచ్చాక తెలంగాణ భూములు బీడు భూములుగా మారాయన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో అద్భుతంగా నిర్మించిన తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలోనే కుప్ప కూల్చిందన్నారు. అంతకు ముందు నూతన జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌ను జిల్లా అధ్యక్షుని కుర్చీలో కూర్చోపెట్టి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త తిప్పన విజయసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నల్లమోతు భాస్కర్‌రావు, నాయకులు నిరంజన్‌వలీ, కటికం సత్తయ్యగౌడ్, రాంచందర్‌నాయక్, చీర పంకజ్‌యాదవ్, బొర్ర సుధాకర్, మాలే శరణ్యరెడ్డి, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, కరీంపాషా, బక్క పిచ్చయ్య, పరిదోద్దిన్, సింగం రాంమోహన్, షైనం శ్రీనివాస్, బకరం వెంకన్న, లోడంగి గోవర్ధన్, ఆలకుంట్ల నాగరత్నంరాజు, బోనగిరి దేవేందర్, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, అయితగోని యాదయ్య, రావుల శ్రీనివాస్‌రెడ్డి, పద్మ, జయప్రదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మామిడి సర్వయ్య, కట్ట వెంకట్‌రెడ్డి, చంద్రమౌళి, దుబ్బ వెంకన్న, దాసరి సతానియల్, చీపుట సైదులు, శేఖర్‌బాబు, గంట శంకర్, దాసరి వెంకన్న, మహేశ్వరం వెంకన్న, పాక యాదయ్య, బోడ నర్సయ్య, అంకర్ల పున్నమినాగు, వేముల మనోజ్, గుండ్ల రవి, బట్ట వీరబాబు, నారగోని వీరయ్య, రాపాక రాజు, శ్రీనివాస్, శ్రీను, వెంకన్న, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



శాలిగౌరారం: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వెంకన్నగౌడ్

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, మర్రిగూడ, ఏప్రిల్ 27: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మర్రిగూడ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి పలు పార్టీలకు చెందిన పలువురు నేతలు తమ అనుచరులతో కలసి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో శనివారం వేర్వేరుగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని రాంరెడ్డిపల్లి, లెంకలపల్లి, కొట్టాల, తమ్మడపల్లి, అంతంపేట గ్రామాల నుంచి సుమారు 200మంది ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో అంతంపేట బీఆర్ఎస్ ఎంపీటీసీ బంతిలాల్, దళితబంధు జిల్లా కమిటీ మాజీ సభ్యుడు లవంగి నర్సింహ, రజాక్ వీరితో పాటు పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి పున్న కైలాష్‌నేత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సైదులు, నాయకులు చెరిపెల్లి వెంకటేశం, పాల్వాయి జితేందర్‌రెడ్డి, లింగస్వామి, మహేష్, సైదులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీరాందాసు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ యాదయ్య, జడ్పీటీసీ సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు రాజమణిహరికృష్ణ, కృష్ణ, నగేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

కొండమల్లేపల్లి: ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సమక్షంలో మండలంలోని చింతకుంట్ల, చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీలకు చెందిన సుమారు 60 కుటుంబాలు శనివారం బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతోనే పార్టీలో చేరుతున్నారని, ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉట్కూరి వేమన్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, వెంకటయ్య, మంగ్యానాయక్, సుధాకర్, సైదులు, సురేష్, ఎంపీటీసీ సుమలత, భాస్కర్ పాల్గొన్నారు.

నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి : డీఈవో



కొండభీమనపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

దేవరకొండ, ఏప్రిల్ 27: ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీటి ట్యాంకులు, ప్రహరిగోడలు, ఇతర నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని డీఈవో భిక్షపతి అధికారులను కోరారు. దేవరకొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, తూర్పుపల్లి ఉన్నత పాఠశాల, కొండభీమనపల్లి ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న అదనపు తరగతి గదులు, బాత్రూంలు, మరుగుదొడ్లు, ప్రహరిగోడల నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు తెరిచేలోగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. దేవరకొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట దేవరకొండ ఎంఈవో మాతృనాయక్, ఏఈ లస్కర్ ఉన్నారు.

వాడవాడలా అరుణ పతాకాన్ని ఆవిష్కరించాలి

నల్లగొండరూరల్, కట్టంగూరు, ఏప్రిల్ 27: మేడే సందర్భంగా వాడవాడలా అరుణ పతాకాన్ని ఆవిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు సలీం, సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంతో పాటు కట్టంగూరులో నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొన్నారు. మత విద్వేషాలను రెచ్చగొడుతూ కుల, మత, ప్రాంత వైషమ్యాలను సృష్టిస్తూ కార్మిక వర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేసే బీజేపీని పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని అన్నారు. మేడే రోజున ఉదయం 8గంటల కల్లా అన్ని యూనియన్ సంఘాలు ఎర్రజెండాను ఆవిష్కరించాలని అన్నారు. అద్దంకి నర్సింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంజనేయులు, శంకర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ కట్టంగూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పొడిచేటి సులోచన, కోకన్వీనర్‌గా గుడుగుంట్ల రామకృష్ణ, కట్ట బక్కయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంజర్ల సైదులు, తవిటి వెంకటమ్మ, శోభ, శ్రీను, ముత్యాలు, రామలింగయ్య పాల్గొన్నారు.

● ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి వెంకటేశ్వర్లు, లెనిన్, గుండె రవి, జానీ, యూసఫ్, మదార్ దస్తగిరి, బుర్రి రాములు, యాదయ్య, నాగరాజు, కొండ రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మూసీకి నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి, ఏప్రిల్ 27: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. 645అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు ఈ నెల మొదటి వారంలో సాగునీటి విడుదలను నిలిపివేసే నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 618అడుగులు (0.38టీఎంసీలు) కనిష్ఠస్థాయికి పడిపోయింది. ఈ క్రమంలో మూసీ నది ఎగువన గల ధర్మారెడ్డి కాల్వ, పిల్లాయిపల్లి, ఆసిఫ్‌నహర్ కత్వలు, ఇతర ఫీడర్ చానళ్లకు హైదరాబాద్ నగరం నుంచి వచ్చే డ్రైనేజీ, వృథా నీటిని మళ్లించడంతో చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలంలోనిపలు చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగులు పోస్తున్నాయి. ఆయా చెరువులు, కుంటల అలుగుల నుంచి వచ్చే నీరంతా ప్రస్తుతం దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరుతుండడంతో 15 రోజులుగా ప్రాజెక్టుకు దాదాపు 300క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 623.10 అడుగులు (0.67టీఎంసీలు)గా నమోదైంది. కాగా గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 629 అడుగులు (1.27టీఎంసీలు)గా, ఇన్‌ఫ్లో 672క్యూసెక్కులుగా ఉంది.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



గుర్రంపోడులో ఓటర్లకు పోల్ చిట్టీలను అందజేస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

గట్టుప్పల్, ఏప్రిల్ 27: గ్రామంలో ఉన్న ఓటర్లు అందరూ సరైన గుర్తింపు కార్డుతో ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ కె.రాములు కోరారు. గట్టుప్పల్ మండల పరిధిలోని అంతంపేట గ్రామంలో శనివారం ఓటర్లకు పోల్ చిట్టీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో పోలింగ్ బూత్ వద్దకు వెళ్లే సమయంలో ప్రతి ఒక్కరూ సరైన గుర్తింపు కార్డును తీసుకెళ్లాలని సూచించారు. ఏదైనా సందేహం ఉంటే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు కలమ్మ, యాదమ్మ, అంబిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **గుర్రంపోడు:** మండల కేంద్రంలో పోల్ చిట్టీల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వజ్రాయుధమని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పోల్ చిట్టీల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సిబ్బంది విధుల్లో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో బీఎల్‌వో నాగమణి, మేడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి

చండూరు, ఏప్రిల్ 27: మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో శంకర్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. మండలవ్యాప్తంగా 3400 మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారని, జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని అన్నారు. రైతులు, కూలీలు పనులు కావాల్సిన వారు గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని కోరారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

దేవరకొండ, ఏప్రిల్ 27: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని శేరిపల్లిలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింహ, నాయకులు శ్రీను, రాఘవచారి, కొండల్ పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నర్సింహ

దేవరకొండ, ఏప్రిల్ 27: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దేవరకొండ మండలం తూర్పుపల్లి గ్రామానికి చెందిన అంకూరి నర్సింహను నియమిస్తూ బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సింహ ఏబీవీపీ నగర కార్యదర్శిగా, బాగ్‌ప్రముఖ్‌గా, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పని చేశారు. బీజేపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జీఎడవల్లిలో ఘనంగా బోనాలు

కనగల్, ఏప్రిల్ 27: మండలంలోని జీఎడవల్లి గ్రామంలో కంఠమహేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామస్థులు ఘనంగా బోనాలు తీశారు. మహిళలు కొత్త కుండల్లో బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో గ్రామశివారులోని ఆలయం వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. దేవతామూర్తులకు బోన నైవేద్యాలను సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈఎస్ఐ ఆస్పత్రికి సొంతభవనం నిర్మించాలి

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 27: ఈఎస్ఐ ఆస్పత్రికి సొంతభవనం నిర్మించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు డబ్బీకార్ మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాణిజ్య, వ్యాపార రంగంలో అగ్రగామిగా ఉన్న ఈ ప్రాంతంలో వేలాది మంది కార్మికులు ఉన్నారని తెలిపారు. వారందరికీ వైద్యసేవలందించే ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేసేందుకు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఎనలేని కృషి చేశాడన్నారు. అయితే ఆస్పత్రిని అద్దె భవనంలో అరకొర వసతుల నడుమ నిర్వహించడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. 19 నెలలుగా ఆస్పత్రి అద్దె చెల్లించకపోవడంతో భవన యజమాని తాళం వేయగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నెస్పీ క్యాంపులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో గౌతంరెడ్డి, రవినాయక్, వినోద్, ఈదయ్య, శ్రీనివాస్, దేవయ్య, రాంమూర్తి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

హాలియా: ఇంటర్ ఫలితాల్లో 465 మార్కులు సాధించిన హాలియాకు చెందిన విద్యార్థులు జిల్లేల్లి ప్రమోద్, యష్మిష్‌లను హాలియా ఎస్ఐ సతీష్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్‌రెడ్డి విద్యార్థులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ముందు కూడా ఇలాంటి ఎన్నో అత్యుత్తమ ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో మాధవరం నరేందర్‌రావు, జిల్లేపల్లి శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

మిర్యాలగూడటౌన్: సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ అన్నారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులు పలు సమస్యలను డీఎం దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమం అనంతరం మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతామని, ప్రాంగణంలో వేచి చూసేందుకు అవసరమైన అదనపు సదుపాయాలను సమకూరుస్తామని తెలిపారు.

శాలిగౌరారం: మండలంలోని తిరుమలరాయినిగూడెం గ్రామ బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్రె సైదులు, ఉపాధ్యక్షుడు గుండ్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి నోముల రమేష్, సహాయ కార్యదర్శి చిలుకూరి ప్రవీణ్, కోశాధికారిగా టేకుల నవీన్ ఎన్నికయ్యారు.

మునుగోడురూరల్: స్వామి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎల్గలగూడెం గ్రామ యువజన కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అభిమాని తీర్పరి స్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతని నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు.

దామరచర్ల: మండల పరిధిలోని వీర్లపాలెంలో ఆదివారం 11 కేవీ విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున ఆదివారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ అబ్దుల్లా హబీబ్ తెలిపారు.

నల్లగొండ కల్చరల్: పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో ఈ నెల 28వ తేదీ నుంచి 30 రోజుల పాటు వేసవి ఉచిత నృత్య శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తొగోటి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కూచిపూడి, భరతనాట్యం, కథక్, డ్రాయింగ్, తెలుగు, ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్ వాటిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కావున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9553985143 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రామగిరి: సార్వత్రిక పరీక్షల్లో ఇన్విజిలేటర్ విధులు ఎస్టీటీలకు అవకాశం ఇవ్వాలని టీసీటీయూ జిల్లా అధ్యక్షుడు కొన్నె శంకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గతంలో పనిచేసిన ట్యూటర్లకే మళ్లీ అవకాశం ఇవ్వడం వల్ల అవినీతి ఆస్కారం జరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని కోరారు.

మిర్యాలగూడ టౌన్: సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ అన్నారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులు పలు సమస్యలను డీఎం దృష్టికి తెచ్చారు. కార్యక్రమం అనంతరం మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతామని, ప్రాంగణంలో వేచి చూసేందుకు అవసరమైన అదనపు సదుపాయాలను సమకూరుస్తామని తెలిపారు.

కట్టంగూరు: భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, బీజేపీ మండలాధ్యక్షుడు పబ్బు వెంకటేశ్వర్లు, నాయకులు భాస్కర్, హరిబాబు, నాగరాజు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల కోసం ప్రైవేటు టీచర్లను ఇంటింటికీ పంపడం సబబు కాదని తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజినాయక్ పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుండా ప్రైవేట్ టీచర్లను ఇబ్బందులకు గురిచేసే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

నార్కట్‌పల్లి: శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని గుత్తా యువసేన జిల్లా నాయకుడు గుండె రవి అన్నారు. కిషోర్ ఇసుక దొంగ, దొంగ నోట్ల వ్యాపారి, అక్రమదందాలు, బినామీ పేర్లతో చేసే వ్యక్తి అన్నారు.

త్రిపురారం: సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడిగా త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామానికి చెందిన బొజ్జ సోమయ్య నియమితులయ్యారు. హైదరాబాద్‌లో సమాచారహక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షుడు ఏర్పుల యాదయ్య నియామకపత్రం అందించారు.

కనగల్: మండలంలోని బుడుమర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి, లక్ష్మణ, భక్తాంజనేయ, భవానీశంకర, నవగ్రహ, ధ్వజస్తంభ, శిఖర విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరుకానున్నట్లు మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా స్వామివారి కల్యాణోత్సవంలో మంత్రి పాల్గొంటారని వివరించారు.

నల్లగొండ: బీసీ సామాజికవర్గాలకు చట్టపరమైన భద్రత లేనందునే కులం పేరుతో దూషిస్తూ భౌతికదాడులు జరుగుతున్నాయని నల్లగొండ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థులు పాలకూరి రవి, పాలకూరి రమాదేవి అన్నారు. భౌతికదాడులను అరికట్టాలంటే బీసీ సామాజిక వర్గాల్లో చైతన్యం రావాలని అన్నారు. అందుకు మన ఓటు మనం వేసుకుంటేనే పార్లమెంటులో మన గొంతు వినిపిస్తుందని అన్నారు. వివిధ రాజకీయ పార్టీలో అగ్రవర్ణ నేతలు బీసీ సామాజిక వర్గాలను జెండాలు మోయిస్తూ తమ దగ్గర బానిసల్లాగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి గడగోజు విజయ్, బీసీ కుల సంఘాల ఐక్యవేదిక యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దోరెపల్లి హరిశంకర్, పట్టణ అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, శివకుమార్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు తాగునీటికి తీవ్ర ఇబ్బదులు ఎదుర్కొంటున్నారు. వేసవికాలంలో తాగునీటిని అందుబాటులో ఉంచడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారని ప్రయాణికులు ఆరోపించారు.